


# పి. శ్రీనివాస శాస్త్రి

"లక్షలు ఆదా చేయడం ఏమంత పెద్ద కష్టంకాదు. నిన్నటికి నిన్న 15వేలు ఆదా చేశాను తెలుసా?"

వేడివేడి కాఫీని ఆరారగా సేవిస్తూ బెటరాఫ్ సుబ్బ లక్ష్మితో అన్నాడు రాంబాబు.

సుబ్బలక్ష్మి తన సంతోషాన్ని కళ్లతో చాటించింది. పక్కింటి రాధాభాయి మొన్ననే ఫ్రిజ్ కొంది. కింగ్ సైజు సబ్బుబిళ్లలా ఫ్రిజ్ తళతళ లాడుతుంటే సుబ్బ లక్ష్మికి ఏడుపొచ్చినంత పనై రాంబాబుని సతాయిం చింది. "లోపల యంత్రం లేకపోయినా ఫరవాలేదు. బీరువాలాగా వాడుకోవచ్చు. కనీసం ఫ్రిజ్‌లా కనిపిస్తే చాలు. రేకు డబ్బా అయినా సరే. అర్జంటుగా పట్టాం డి" అన్నది సతాయింపు సారాంశం.

"ఇదిగో నేను ఖర్చు మనిషిని కాను. ఆదా మనిషి ని. నిన్నటికి నిన్న పదిహేనువేలు ఆదా చేశాను" అని రాంబాబు చెప్పేసరికి "నిజంగా నాకోసమేనా" అని సుబ్బలక్ష్మి సర్దావడింది.

"నీకోసం కాకపోతే ఎవరికోసం?" అని లంచం లాటి డైలాగు చెప్పి మరో కప్పు కాఫీ కొట్టేసాడు రాంబాబు.

"ఈవేళ ఆదివారం. సరదాగా ఎక్కడికన్నా తీసి కెళ్లండి" అంటూ గారాలు పోయింది సుబ్బలక్ష్మి.

"షాపింగ్ చేయడం నాకు ఇష్టం ఉండదు. చెప్పా నుగా ఆదా మనిషినని. విండో షాపింగ్ అని ఇంగ్లీషులో ఓ ముక్క ఉంది. బజార్లో అన్ని కొట్లూ తిరిగి అన్ని వ స్తువులూ కళ్లారాచూసి, చేతులారా కొనకుండా వ చ్చేయడం అన్నమాట. అది చేద్దామన్నా సగటు మనిషి సెలవురోజు ఆదివారంనాడు బజార్లు నోళ్లు మూసుకుని వెలవెలబోతాయి. ఆదివారంనాడు కొట్లు మూసేయడం అనేది సగటు మనిషి సరదామీద సాడిస్టు పాలకులుతీసిన దొంగదెబ్బ. సినిమాలవీ తెరిచి ఉంచడం అనేది సామాన్యుడి పర్సుమీద సాగి స్తున్న కుట్ర. వెళ్లి వెళ్లి కుట్రలో ఇరుక్కుందామా చెప్పు" అని నిలేసాడు భార్యని.

సుబ్బలక్ష్మి బెంబేలు పడిపోయింది. పేపర్లో చదివే కుట్ర కేసులూ అవీ గుర్తొచ్చాయి. "వద్దండీ. సెలవు రోజున సర్దాలూ అవీ లేకుండా కుట్రలో ఇరుక్కోడం ఎందుకు?" అని చప్పున అలా బజార్లో సర్దాని ఆర్పేసుకుంది.

రాంబాబు దిగ్విజయంగా నవ్వి "చెప్పానా ఆదా మనిషినని. నీకోసం లక్షలు కోట్లు ఆదా చేస్తాను. అన్ని సర్దాలూ ఒక్కపనితో తీరిపోయే ఏర్పాటు సృష్టిలో ఉంది. అదేమిటో చెబుతాను. గదిలోకిరా" అని బెడ్రూములోకి దారితీసాడు పొద్దున్నే.

"పళ్లు తోముకోకుండా సృష్టి రహస్యాలు మాట్లా డితే దేముడిక్కోపం వస్తుంది" అనిభయపెట్టి వంటిం ట్లోకి వెళ్లిపోయింది సుబ్బలక్ష్మి.

ఆ ఇంటికి రెండే గదులున్నాయి. ఆ రెండు గదుల్లోనే బెడ్రూముకీ, లివింగ్ రూముకీ, డైనింగ్

# విధిచాల సుఖమా

పోలుకీ వెళ్లే చిట్కా ఆ దంపతులిద్దరికే తెలుసు!

* * * * *

"చూడబోతే త్వరలోనే నేను ఆదాచేసిన డబ్బు అరలక్ష దాటొచ్చు. మొన్న పదిహేను వేలు ఆదా చేశానా? నిన్న 20వేలు చేసాను" రాంబాబుకి కోర మీసం ఉంది. దాన్ని మెలేస్తూ చెప్పాడాముక్క.

నేను మాటలు ఆదాచేసే మనిషినని చెబుతున్నట్టు కళ్లతో ఆశ్చర్యం సంతోషం వెల్లడించి మేలురకం బెండకాయలు చకచకా తరిగి పోయడంలో పడింది సుబ్బలక్ష్మి.

అరలక్షతో ఏమేమి చేయవచ్చో ఆలోచిస్తోంది. పక్కింటి రాధాబాయి పొగరణిచేయొచ్చు ఇమీడియెట్‌గా!

గొప్ప సంతోషంతో బెండకాయలు అర్ధనిమిషంలో తరిగేసింది.

"అరలక్ష ఆదా అయ్యిం తరవాత దాన్ని ఏం చేద్దామంటారు? కుట్టలూ అవీ చెప్పకండి బాబూ" అని నీలవేణిలా నవ్వుతూ అడిగింది.

"అరలక్షని ఆమట్ను లక్ష చేద్దాం. లక్షని రెండు లక్షలు. అన్నట్టు కోటి అంటే వంద లక్షలే కదా?! ఏడాది తిరిగేసరికి మన ప్రథమ వివాహ వార్షికోత్సవం వస్తుంది. అప్పటికి మనం ఆదాచేసిన డబ్బు కోటి అవుతుంది" అని కోరమీసం మెలేసాడు రాంబాబు. అక్కడినించి 'చిట్కా' ఉపయోగించి 'బెడ్‌రూము'లోకి వెళ్ళిపోయాడు.

బెండకాయల తరవాత ఉల్లిపాయలు తరిగి పోస్తూ రూపాయలగురించి ఆలోచించింది సుబ్బలక్ష్మి. బోలెడు అనుమానం వచ్చేసింది. "కొంటె మనిషి బాబూ. నిజమో అబద్ధమో" అని బెంగెట్టేసుకుని రివటలా లేచింది.

రాంబాబు ముసుగుతన్ని 'విధిచాల సుఖమా' పాడుతున్నాడు.

దుప్పటి లాగి నిలేసింది సుబ్బలక్ష్మి.

"నిజంగా మీరు మొన్న పదిహేనువేలూ, నిన్న ఇరవై వేలూ ఆదా చేశారా? నిజంగానే త్వరలో ఆరు లక్షలు ఆదా చేస్తారా? నిజంగానే కోటి రూపాయలు ప్రథమ వార్షికోత్సవం నాటికి కూడబెడతారా?! నిజంగానే. నిజంగానే?!" అని ఏ నిజం వినాల్సొస్తుందో అన్నట్టు సస్పెన్సు ముఖం పెట్టి నిలబడింది.

"నిజంగానే.. నిజంగానే.. ఎలాగో చెబుతాను విను" అని సుబ్బలక్ష్మిని పక్కన కుదేసి ఆదా చిట్కా విప్పి చెప్పాడు.

"మొన్న బజార్లో సరికొత్త మోటార్ స్కూటర్ చూశాను. దాని ఖరీదు పదిహేనువేలు. నిన్న నువ్వు కట్టుకుంటే అదిరిపోయే గద్వాలచీర, నేనుపొంతం చేసుకుంటే దిమ్మతిరిపోయే సూటూ, బూటూ, మనింటి కొచ్చే అతిథులు కూర్చోడానికి సౌకర్యంగా ఉండే సోఫాసెట్టూ అదీ చూశాను. వాటి మొత్తం ఖరీదు 20 వేలు" అన్నాడు రాంబాబు.

"ఛల్... ఛల్...." అని సుబ్బలక్ష్మి చప్పట్లు కొట్టింది.

"మొన్న చూసిన స్కూటర్ నేను కొనదల్చుకోలేదు. పదిహేనువేలు ఆదా. నిన్న చూసిన గద్వాల చీర, సూటూ, బూటూ, సోఫాసెట్టూ అదీ నేను చచ్చినా కొనను. ఇరవై వేలు ఆదా. ఇలా ఏడాదిలో కోటి రూపాయలు ఆదా. పో... పోయి వెంటనే కాఫీ పట్రా" అని మళ్లీ ముసుగుతన్ని 'విధిచాల సుఖమా' ఎత్తుకున్నాడు రాంబాబు.

సస్పెన్సు విడిపోయిన సుబ్బలక్ష్మికి పిచ్చిపిచ్చి పిట్టచ్చేంత పనయింది! ●

## మహా అయితే మరోవందేళ్లు (చూస్తూ ఊరుకుంటే)

పాపం ధరిత్రి
వెచ్చనెండా
పచ్చనిచెట్లూ
పరిగెత్తే ఏళ్లూ
బతగడానికి వీళ్లూ
భారీగానే ఇచ్చింది
శాపం చరిత్ర
నవ మోసాలూ
మేసి కంటోంది
బోసి కొండలూ
భోపాల రాగాల
పాపాల మూటలూ
మాలిన్యపు మడుగులూ
మకిలిని మోసే నీళ్లూనూ



—నందివాడ భీమారావు